# జీవో ఇచ్చారు... నిధులు మరిచారు

- ★ లింగమంతుల స్వామికి శఠగోపమేనా..?
- ★ నాలుగు నెలలవుతున్నా వెలుగు చూడని నిధులు
- ★ ఆందోళనకు సిద్ధమవుతున్న పనులు చేపట్టిన కాంట్రాక్టర్లు
- ★ బీఆర్ఎస్ హయాంలో మరుసటి రోజే నిధులు



బీఆర్ఎస్ హయాంలో సర్వాంగ సుందరంగా మారిన పెద్దగట్టు లింగన్నస్వామి ఆలయం(ఫైల్)

సూర్యాపేట, జూన్ 22 (నమస్తే తెలంగాణ) : సాక్షాత్తు రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ఓ జీవోకు దిక్కుమొక్కు లేకుండా పోయింది. ఫిబ్రవరి తొలి వారంలో పెద్దగట్టు లింగమంతుల స్వామి జాతర కోసం రూ.5 కోట్లు విడుదల చేస్తూ జీవో విడుదలైంది. నాలుగు నెలలు పూర్తి కావస్తున్నా నిధులు విడుదల కాకపోవడం పట్ల అప్పులు చేసి పనులు చేపట్టిన కాంట్రాక్టర్లు కార్యాలయాల చుట్టూ తిరిగి తిరిగి ఓపిక నశించడంతో ఆందోళనలకు సిద్ధం అవుతున్నట్లు తెలిసింది. ఉమ్మడి రాష్ట్రంలో పెద్దగట్టు జాతర సందర్భంగా కనీస మౌలిక సదుపాయలు కల్పించక పోగా, ప్రతి జాతరకు రూ.25 నుంచి 75 వేలకు మించి నిధులు విడుదల చేయలేదు. అలాంటిది తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అనంతరం ప్రతి ఏటా కోట్లాది రూపాయలు విడుదల చేయించడంతో జగదీష్‌రెడ్డికి ముందు తరువాత అనే రీతిన అభివృద్ధి చెందింది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తరువాత ఇచ్చిన జీవోకే విలువ లేకపోవడం పట్ల మళ్లీ అదే పరిస్థితి దాపురిస్తదా ఏందనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

### మోసపూరిత వాగ్దానాలు, అబద్ధపు హామీలు..

అధికారమే ఏకైక పరమావధిగా గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మోసపూరిత వాగ్దానాలు, అబద్ధపు హామీలు అన్నీ ఇన్నీ కావు. గత ఏడాదిన్నరలో ఆ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీలు, 420 హామీలు దాదాపు 98 శాతం తేలిపోయాయి. ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడమే కాకుండా గత బీఆర్ఎస్ హయాంలో కేసీఆర్ ఇచ్చిన పథకాలను కూడా కొనసాగించలేని దుస్థితికి కాంగ్రెస్ ప్రభుత్వం చేరుకుంది. మాట మాట్లాడితే డబ్బులు లేవు... ఖజానా ఖాళీ ఉంది అంటూ ప్రభుత్వ పెద్దలు చెబుతూ కనీసం ఎక్కడైనా నిధులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా విడుదల చేసిన జీవోలను గాలికి వదిలేస్తున్న ఉదంతాలు ప్రభుత్వ దయనీయ స్థితికి అద్దం పడుతోంది.

### బీఆర్ఎస్‌లో హయాంలో వెంటనే నిధులు

బీఆర్ఎస్ హయాంలో ఏదైనా జీఓ విడుదలైతే దానికి సబంధించి వారం లోపే నిధులు విడుదలయ్యేవి. అలాంటిది కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత నెలలు గడిచినా నిధులు రావడం లేదు. ఇప్పటికే కోదాడ, హుజూర్‌నగర్‌తో పాటు జిల్లా వ్యాప్తంగా పలు పనులకు సంబంధించి జీవోలు జారీ చేసినా పనులు ప్రారంభం కాలేదు. ఇతర పనులు అలా ఉంటే దేవుడికి కూడా శఠగోపం పెడుతున్నారు. సూర్యాపేటకు సమీపంలోని పెద్దగట్టు లింగమంతుల స్వామి జాతర సందర్భంగా మౌలిక సదుపాయలు, కొన్ని శాశ్వత పనులు చేపట్టేందుకు గాను రూ.5 కోట్లు విడుదల చేస్తూ జీవో జారీ చేసి నాలుగు నెలలు గడుస్తున్నా నేటికీ నిధులు విడుదల కాకపోవడం గమనార్హం. తెలంగాణలోనే రెండో అతిపెద్ద జాతరగా పేరొందిన లింగమంతుల స్వామికి 2014కు పూర్వం గత ఉమ్మడి రాష్ట్రంలో జాతరకు యాభై వేలు మంజూరీ చేసిన దాఖలాలు లేకపోగా కనీస గుర్తింపు కూడా ఇవ్వలేదు. కానీ తెలంగాణ ఏర్పాటు అనంతరం మంత్రిగా పనిచేసిన జగదీష్‌రెడ్డి చొరవతో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన ఐదు జాతరలకు కలిపి దాదాపు రూ.15 కోట్లకు పైనే ఖర్చు చేయడంతో పెద్దగట్టు రూపురేఖలే మారిపోయాయి. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత ఫిబ్రవరిలో జాతర జరుగగా జాతర సమయం దగ్గర పడిన తరువాత విమర్శలు తట్టుకోలేక రూ.5 కోట్లు మంజూరీ చేస్తూ జీఓ విడుదల చేసింది. దీంతో జాతర నిర్వహణ కోసం దాదాపు 14 శాఖల ఆధ్వర్యంలో జరిగిన పనులను తరువాత నిధులు ఇస్తామని చెప్పి కాంట్రాక్టర్లతో చేయించారు. కానీ నాలుగు నెలలైనా నిధులు విడుదల కాకపోవడం, కాంట్రాక్టర్లకు బిల్లులు రాకపోవడంతో చేసిన అప్పులకు వడ్డీలు పెరుగుతున్నాయని వాపోతున్నారు. జీవోలు ఇచ్చి చేతులు దులుపుకోవడం కాదు, వెంటనే నిధులు విడుదల చేయాలని పలువురు కాంట్రాక్టర్లు కోరుతున్నారు.

## ఉపాధి చట్టాన్ని నిర్వీర్యం చేసే కుట్ర

నూతనకల్, జూన్ 22 : కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ఉపాధి చట్టాన్ని నిర్వీర్యం చేసే కుట్రను వేగవంతం చేస్తోందని సీపీఎం మండల పార్టీ కార్యదర్శి కందాల శంకర్ రెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉపాధిహామీ పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. పెరిగిన ధరలకు అనుగుణంగా రూ.600, 200 రోజుల పని దినాలను కల్పించాలని కోరారు. రెండు నెలల నుండి ఉపాధి హామీ కూలీల బిల్లులు చెల్లించలేదని, వెంటనే చెల్లించాలని కోరారు. ఈ సమావేశంలో సైదులు, లింగయ్య, రాములు, ఏకస్వామి, నారాయణ, సూరయ్య పాల్గొన్నారు.

## గుట్టపై బయల్పడిన అమ్మవారి విగ్రహం



నేరేడుచర్ల,జూన్ 22 : మండలంలోని ఫత్తేపురం గ్రామంలో ఆదివారం పెద్ద గుట్ట మీద ఉన్న పుట్టని కడుగుతుండగా అమ్మవారి పురాతన విగ్రహం బయట పడింది. గ్రామానికి చెందిన నూకల రాంరెడ్డి, చింతకుంట్ల రాజేష్‌రెడ్డి, మచ్చ గోపాల్, రమేష్, ప్రదీప్, రాంబాబులు పుట్టను కడుగుతుండగా అమ్మవారి విగ్రహం వెలుగు చూసింది. వెంటనే అమ్మవారిని అక్కడే తాత్కాలికంగా ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పసుపు, కుంకుమ వేసి కొబ్బరికాయలు కొట్టి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారి విగ్రహం బయటపడిన విషయం గ్రామంలో తెలియడంతో గ్రామస్తులు వచ్చి అట్టహాసంగా పూజలు నిర్వహించి అమ్మవారిని కొలుస్తున్నారు.

## మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి




డ్రగ్స్‌పై అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ రవిందర్ నాయక్

నేరేడుచర్ల, జూన్ 22 : మాదక ద్రవ్యాలకు బానిసై జీవితాలను ఆగం చేసుకోవద్దని, వాటికి దూరంగా ఉండాలని నేరేడుచర్ల ఎస్ఐ రవిందర్ నాయక్ అన్నారు. ఆదివారం పట్టణంలోని లారీ ఆఫీస్ సమీపంలో మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే నష్టాలపై లారీ డ్రైవర్లకు, కూలీలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రగ్స్ నిర్మూలనలో ప్రతి ఒక్కరు తమ వంతు సహకారం అందించాలని కోరారు. ఎక్కడైనా గంజాయి లాంటి మత్తు పదార్థాలు విక్రయిస్తున్నా, వినియోగిస్తున్నా వెంటనే సమాచారం అందించాలని కోరారు. మత్తు పదార్థాలు వినియోగించడం వల్ల నాడీ వ్యవస్థ దెబ్బతిని ఆరోగ్యం క్షీణిస్తుందన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేద విద్యార్థినికి పుస్తకాలు బహూకరణ



విద్యార్థినికి పుస్తకాలు అందజేస్తున్న పావని, కృపాకర్

సూర్యాపేటటౌన్, జూన్ 22 : సూర్యాపేట జిల్లా కేంద్రంలోని 45వ వార్డుకు చెందిన నిరుపేద విద్యార్థినికి రూ 10,500ల విలువ చేసే ఇంటర్ ద్వితీయ సంవత్సరం టెక్ట్స్ పుస్తకాలను బీఆర్ఎస్ మాజీ కౌన్సిలర్ గండూరి పావని కృపాకర్ ఆదివారం అందజేశారు. పట్టణానికి చెందిన అలి ఆర్ట్స్ నిర్వాహకులు ఎం.డి.అలి కుమార్తె ఆసియా నజీమా ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ఇంటర్ మొదటి సంవత్సరంలో అత్యుత్తమ మార్కులు సాధించగా ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదివేందుకు ఆర్థికస్థితి సహకరించకపోవడంతో స్పందించిన బీఆర్ఎస్ జిల్లా నాయకులు గండూరి కృపాకర్, మాజీ కౌన్సిలర్ పావని స్పందించి పుస్తకాలు కొనుగోలు చేసి అందించారు.

## ఆర్య వైశ్యులు రాజకీయంగా ఎదగాలి

సూర్యాపేటటౌన్, జూన్ 22 : రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎక్కువ స్థానాల్లో ఆర్యవైశ్యులు నిలబడి గెలవాలని ప్రజలకు మరింత సేవలు అందించాలని తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు అమరవాది లక్ష్మీనారాయణ అన్నారు. ఆదివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని సంతోషిమాత ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మాట్లాడారు. రాజకీయ పార్టీలు ఆర్యవైశ్యులకు సముచితస్థానం కల్పించాలన్నారు. పేద ఆర్యవైశ్యులకు, ఆర్యవైశ్య విద్యార్థులకు సహాయం అందించాలన్నారు.

## నేడు విశాలాక్షి సమేత విశ్వేశ్వర స్వామి ద్వితీయ వార్షికోత్సవం

అర్వపల్లి, జూన్ 22 : మండల పరిధిలోని బొల్లంపల్లి గ్రామంలో నేడు (సోమవారం) శ్రీ విశాలాక్షి సమేత విశ్వేశ్వర స్వామి దేవాలయం ద్వితీయ వార్షికోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నట్లు దేవాలయ ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం అఖండ దీపారాధన, గణపతి పూజ, పుణ్యాహవచనం, మహాన్యాస, పూర్వక రుద్రాభిషేకం, రుద్రహోమం, మధ్యాహ్నం బలిహరణ, పూర్ణాహుతి, ప్రసాద వితరణతో పాటు భక్తులకు అన్నదానాన్ని ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

## శాస్త్రోక్తంగా నృసింహుడి నిత్యకళ్యాణం



మఠంపల్లి,జూన్ 22 : మండలంలోని మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో నృసింహుడికి నిత్యకళ్యాణం ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారిని పట్టువస్త్రాలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేసి కళ్యాణతంతు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాలలో ఆలయ అనువంశిక ధర్మకర్త చెన్నూరు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈవో సిరికొండ నవీన్, ఆలయ అర్చకులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

## ఎమ్మార్పీఎస్ యూత్ కమిటీ ఎన్నిక



నేరేడుచర్ల, జూన్ 22 : మండలంలోని సోమారం గ్రామం ఎమ్మార్పీఎస్ యూత్ కమిటీని ఆదివారం ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు యడవల్లి అరుణ్ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. అధ్యక్షుడుగా పెద్ద పంగ సూర్య, ఉపాధ్యక్షులుగా వాడవల్లి గౌతం, పెద్దపంగ దిలీప్, కార్యదర్శిగా పెద్దపంగ భార్గవ్, ప్రధాన కార్యదర్శిగా నందిపాటి సిద్ధు, అధికార ప్రతినిధిగా పాల్వాయి శోభన్, సహాయ కార్యదర్శిగా పెద్దపంగ పృథ్వి, జాయింట్ సెక్రెటరీగా వాడవల్లి స్టాలిన్, కార్యవర్గ సభ్యులుగా మచ్చ చరణ్, ఆకారపు సంతోష్, దూరపల్లి భరత్, పెద్దపంగు సుమంత్, పాల్వాయిమంథు, కార్తీక్, ప్రవీణ్, చరణ్, అర్జున్, వంశీ, వేణులను ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు.

## మున్నూరు కాపు రాష్ట్ర ఉపాధ్యక్షుడుగా కోలా నాగేశ్వర్‌రావు



హుజూర్‌నగర్, జూన్ 22 : హుజూర్‌నగర్ పట్టణానికి చెందిన కోలా నాగేశ్వర్‌రావు మున్నూరు కాపు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడుగా ఎన్నికయ్యారు. ఆదివారం హైద్రాబాద్ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన సంఘ రాష్ట్ర మహాసభలో అధ్యక్షుడు కొండా దేవయ్యపటేల్, ప్రధాన కార్యదర్శి జిల్లేపల్లి వెంకటేశ్వర్లు నుండి ఆయన నియామక పత్రాన్ని అందుకున్నారు. ఆయన ఎన్నిక పట్ల సంఘ నాయకులు కామిశెట్టి వెంకటేశ్వర్లు, శాసనాల నాగసైదయ్య, కాసర్ల నాగేశ్వర్‌రావు, శ్రీనివాసు, రాఘవయ్య తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

## అర్హులందరికీ రేషన్ కార్డులు ఇవ్వాలి

మేళ్లచెర్వు, జూన్ 22 : అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు మంజూరు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి వట్టెపు సైదులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ రోజురోజుకూ పెరుగుతున్న నిత్యావసరాల ధరలతో సామాన్యుడు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రాములు, వెంకన్న, జానీ పాల్గొన్నారు.

# మంజూరు గోరంత...దరఖాస్తులు కొండంత

### రాజీవ్ యువ వికాసం పథకం మంజూరైన యూనిట్లు 373 వచ్చిన దరఖాస్తులు 1354 లబ్ధిదారుల ఎంపికకు కసరత్తు యువత ఎదురు చూపులు




నేరేడుచర్ల, జూన్ 22 : నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రాజీవ్ యువ వికాస పథకానికి శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. దీనిలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనార్టీ నిరుద్యోగులకు కార్పొరేషన్ ద్వారా ఉపాధి కల్పించడమే లక్ష్యం. ఈ పథకం ద్వారా రూ.50వేల నుంచి రూ.4 లక్షల వరకు వివిధ రుణాలను సబ్సిడీ ద్వారా ఇచ్చేందుకు నిర్ణయించారు. రూ.50వేల లోపు బ్యాంకు లింకేజీ లేకుండా పూర్తి సబ్సిడీతో, రూ. 1లక్ష నుంచి రూ, 4లక్షల వరకు ఇచ్చే రుణాలకు బ్యాంకు లింకేజీతో ఇవ్వనున్నారు. కాగా ఈ పథకానికి నేరేడుచర్ల మండలంలోని నిరుద్యోగ యువత పెద్ద సంఖ్యలో దరఖాస్తు చేసుకున్నారు. ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకున్న అప్లికేషన్లను ఎంపీడీవో కార్యాలయంలో అందజేశారు. వాటిని పరిశీలించిన అధికారులు మండలంలోని చిల్లేపల్లి కెనరాబ్యాంకు, దిర్శించర్లలోని ఎస్‌బిఐ, నేరేడుచర్లలోని యూనియన్ బ్యాంకు, గ్రామీణ వికాస్ బ్యాంకుల వారీగా విభజించి దరఖాస్తుదారుల సిబిల్ స్కోర్ పరిశీలిచేందుకు పంపించారు. ఈ పథకానికి ఎంపికైన లబ్ధిదారులకు త్వరలో ప్రొసీడింగ్ కాపీలను అందజేయడానికి ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు.

### స్వీకరించిన దరఖాస్తులు

నేరేడుచర్ల మండలానికి మొత్తం 373 యూనిట్లు మంజూరు కాగా నిరుద్యోగ యువత నుంచి 1354 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో బీసీ కార్పొరేషన్‌కు 100 యూనిట్లకు గాను 657 దరఖాస్తులు, ఎస్సీ 177 యూనిట్లకు గాను 521 దరఖాస్తులు, ఎస్టీ 49యూనిట్లకు గాను 64 దరఖాస్తులు, ఈడబ్ల్యూఎస్ 36 యూనిట్లకు గాను 38 దరఖాస్తులు, ముస్లీం మైనార్టీ 7 యూనిట్లకు గాను 40 దరఖాస్తులు , క్రిస్టియన్ మైనార్టీ నాలుగు యూనిట్లకు గాను 4 దరఖాస్తులు చేసుకున్నారు.

### యువత ఎదురు చూపులు

రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీ మేరకు రాజీవ్ యువ వికాసం పథకాన్ని ప్రవేశపెట్టి యువత నుంచి దరఖాస్తులు స్వీకరించింది. అయితే దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులు మాత్రం బ్యాంకర్ల నుంచి ఎటువంటి ఫోన్ రాకపోయే సరికి వారి కాల్ కోసం ఎదురు చూస్తున్నారు. బ్యాంకర్లు సిబిల్ స్కోర్‌ను పరిశీలిస్తుండడంతో చాలా మందిలో ఆందోళన మొదలైంది. నాకు వస్తుందా రాదా అని ఆలోచనలో పడ్డారు. సిబిల్ స్కోర్‌తో సంబంధం లేకుండా ఎంపిక చేయాలని పలువురు ఆశావహులు వాపోతున్నారు.

### ఉన్నతాధికారులకు అందజేస్తాం

ప్రభుత్వ ఆదేశాల మేరకు వివిధ కార్పొరేషన్ల ద్వారా వచ్చిన దరఖాస్తులను పరిశీలించి బ్యాంకులకు పంపించాం. బ్యాంకుల్లో సిబిల్ ప్రక్రియ కూడా పూర్తి కావచ్చింది. వారు ఇచ్చిన జాబితాను త్వరలోనే ఉన్నతాధికారులకు అందజేస్తాం. ఎలాంటి పైరవీలకు తావులేకుండా అర్హులైన నిరుద్యోగులకు ఈ పథకం అందేలా చూస్తాం.

– సోమసుందర్ రెడ్డి, ఎంపీడీవో, నేరేడుచర్ల

# మార్షల్ ఆర్ట్స్‌ను ప్రోత్సహించాలి

### డీఎస్పీ ప్రసన్నకుమార్



విద్యార్థులకు కరాటే బెల్టులు, సర్టిఫికెట్లు అందజేస్తున్న డీఎస్పీ ప్రసన్నకుమార్

సూర్యాపేటటౌన్, జూన్ 22 : మన దేశంలో పుట్టి ఇతర దేశాల్లో ప్రాచుర్యం పొందిన మార్షల్ ఆర్ట్స్ కరాటేను మన దేశంలో ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని సూర్యాపేట డీఎస్పీ ప్రసన్నకుమాశర్ అన్నారు. ఆదివారం స్థానిక విద్యానగర్ బేబీ మూన్ ఉన్నత పాఠశాలలో సుమన్ షోటో కాన్ స్పోర్ట్స్ కరాటే డు అకాడమి మాస్టర్ జె.వి.రమణ ఆధ్వర్యంలో కరాటే శిక్షణ పొందిన విద్యార్థినీ విద్యార్థులకు బెల్టులు, సర్టిఫికెట్లు ప్రదానం చేసి మాట్లాడారు. తమను తాము రక్షించుకునేందుకు కరాటే ఎంతో దోహడపడుతుందన్నారు. ప్రస్తుత సమాజంలో బాలికలకు కరాటే శిక్షణ ఎంతో అవసరమని పట్టణంలోని ప్రతి సెంటర్‌లో కరాటే శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేసి కరాటే విద్యను నేర్పించాల్సిన ఆవశ్యకత ఉంద న్నారు. కరాటేతో యువత మద్యపానం, డ్రగ్స్ వంటి చెడు అలవాట్ల బారిన పడకుండా దృష్టిని మరల్చవచ్చున్నారు. స్పోర్ట్స్‌లో ప్రతిభ కనభర్చిన వారికి ఆ సర్టిఫికెట్ ఎంతో ఉపకరిస్తుందని, ప్రభుత్వ ఉద్యోగాల్లో 7శాతం కోటా ఉంటుందన్నారు. మార్షల్ ఆర్ట్స్ శిక్షణతో శరీరం ఫిట్‌గా ఉండడంతో పాటు సమాజంలో గౌరవం లభిస్తుందన్నారు. కరాటేను ప్రోత్సహిస్తూ ఎంతో మంది విద్యార్థులకు కరాటే శిక్షణ అందిస్తున్న మాస్టర్ జె.వి.రమణను అభినందించారు. అనంతరం కరాటే విద్యార్థినీ విద్యార్థుల్లో ఎల్లో 30, గ్రీన్ 20, ఆరంజ్ 10, బ్రౌన్ 1, బ్లాక్ 1 బెల్టులతో పాటు సర్టిఫికెట్‌లను అందజేశారు.

## ట్రైకార్ చైర్మన్‌ను కలసిన బంజారా నాయకులు

సూర్యాపేటటౌన్, జూన్ 22 : ట్రైకార్ చైర్మన్ బెల్లయ్యానాయక్‌ను ఆదివారం జిల్లా కేంద్రంలో వ్యవసాయ మార్కెట్ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి, కాంగ్రెస్ ఎస్టీ సెల్ రాష్ట్ర కో–ఆర్డినేటర్ కోటియానాయక్, మార్కెట్ డైరెక్టర్ ధారావత్ వీరన్ననాయక్‌ల ఆధ్వర్యంలో బంజారా నాయకులు, బంజార ఉద్యోగులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బెల్లయ్యానాయక్‌ను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం ఈ నెల 24, 25, 26 తేదీల్లో జిల్లా కేంద్రంలోని రెడ్డి హాస్టల్‌లో జరిగే ఆదివాసి బంజారాల శిక్షణ శిబిరంపై చర్చించారు. శిక్షణ శిబిరం ఏర్పాట్లను స్థానిక నాయకులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో టీడీఈఎస్ఎస్ జిల్లా అధ్యక్షులు పాతులోతు ధారాసింగ్ రాథోడ్, ఆల్ ఇండియా బంజారా సేవా సంఘ్ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు గుగులోతు నాగునాయక్, వి.వి.నాయక్, పాండునాయక్, బాలాజీనాయక్, నంగరాబేరి అధ్యక్షుడు భూక్యా రాజు, నాగునాయక్ పాల్గొన్నారు.

## వర్షాలు కురవాలని కప్ప కావలి



నూతనకల్, జూన్ 22 : వర్షాలు సమృద్ధిగా కురవాలని మండల పరిధిలోని ఎర్రపహాడ్ గ్రామంలోని మహిళలు ఆదివారం కప్ప కావలికి పూజలు చేసి వరుణ దేవుని వేడుకుంటూ పూజలు చేశారు. ఈసందర్భంగా మహిళలు వరుణ దేవుని వేడుకుంటూ కోలాటాలు ఆడారు. ఈ కార్యక్రమంలో అనంతుల నాగమ్మ, సైదమ్మ, నీలమ్మ, పూలమ్మ, వెంకటమ్మ, ఎల్లమ్మ, సుశీల, లక్ష్మీ, పద్మ, సునీత, మంజుల, కీర్తన తదితరులు పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు,ఉపాధ్యాయులు

గరిడేపల్లి, జూన్ 22 : మండలంలోని కల్మల్‌చెర్వు జడ్పీహెచ్ఎస్ పాఠశాలకు చెందిన 1982–83 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు పాఠశాల ఆవరణలో ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈసందర్భంగా ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం నాడు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో గురువులు నారాయణరెడ్డి, మూలగుండ్ల సీతారాంరెడ్డి, ఒంటెద్దు వెంకటరెడ్డి, సైదిరెడ్డి, నర్సిరెడ్డి, కృష్ణ, ఈగ శ్రీనివాసరావు, కందుల కోటిరెడ్డి, సత్యావతి, ధనమ్మ తదితరులు పాల్గొన్నారు.

# వ్యసనాలకు దూరంగా ఉండాలి : సీఐ



మత్తు పదార్థాలపై అవగాహన కల్పిస్తున్న సీఐ రామకృష్ణారెడ్డి.

మోతె, జూన్ 22 : డ్రగ్స్ నిర్మూలన కార్యక్రమంలో భాగంగా ఆదివారం మోతే పీఎస్ పరిధి మామిల్లగూడెం గ్రామాల్లో సీఐ రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈసందర్భంగా మునగాల సర్కిల్ సీఐ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జిల్లా ఎస్పీ నరసింహా ఐపీఎస్ ఆదేశాల మేరకు డ్రగ్స్ నిర్మూలనపై పోలీస్ శాఖ కృషిచేస్తుందని తెలిపారు. గ్రామాలలో యువతను గంజాయి లాంటి డ్రగ్స్ బారి నుండి కాపాడిల్సిన బాధ్యత మనందరిపై ఉన్నదని మన గ్రామాన్ని గంజాయి రహిత డ్రగ్స్ రహిత గ్రామంలో తీర్చిదిద్దుకోవాలని గ్రామ ప్రజలను కోరారు. దీని బారిన పడి యువత భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని పిల్లలపై తల్లిదండ్రులు దృష్టి సారించాలని తెలిపారు.

## అర్థశతాబ్దపు పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

తుంగతుర్తి, జూన్ 22 : అర్థశతాబ్దం తర్వాత పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించుకున్నారు. ఆదివారం మండల పరిధిలోని అన్నారం గ్రామంలో జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో 1974–75లో 8వ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు సీహెచ్ మల్లయ్య ఆధ్వర్యంలో స్థానికంగా అపూర్వ ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటుచేసుకున్నారు. తాము సుదీర్ఘకాలం తర్వాత కలుసుకున్న మిత్రులందరూ తమ తమ అనుభవాలను, తమ చిన్ననాటి జ్ఞాపకాలను ఒకరితో ఒకరు పంచుకొని ఆత్మీయతను చాటుకున్నారు. తమనుండి గతించిన తోటి విద్యార్థులకు, ఉపాధ్యాయులకు అంజలి ఘటించారు. 50 సంవత్సరాల తర్వాత విడిపోయిన తమ స్నేహితులను ఒక వేదిక మీదికి చేర్చడం ఒక అద్భుతం అని తమ జీవితంలో మరుపురాని ఘట్టంగా గుర్తుపెట్టుకుంటామన్నారు. తమకు 64 సంవత్సరాలు ఉంటాయని, తాము 5 తరాలకు చూసిన వారమవడం, మేము మరల కలుసుకొని మాట్లాడుకోవడం, నేర్చుకున్న అద్భుతమని అనుభవాలను పంచుకున్నారు. ఈ సందర్భంగా అర్థశతాబ్దం తర్వాత అందరిని ఒకే చోట కలుసుకునే విధంగా చేసిన ఆర్గనైజర్‌లను అభినందించారు. ఈ అపూర్వక కలయికలో పాఠశాల ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు బింగి లక్ష్మయ్య, పోగుల వెంకట్‌రెడ్డి, గోవర్ధన్, సోమిరెడ్డి, పలువురు పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆలయానికి విరాళం అందజేత

నడిగూడెం, జూన్ 22 : మండల కేంద్రంలోని కోదండ రామస్వామి దేవాలయానికి అనుబంధంగా నిర్మిస్తున్న కల్యాణ మండపానికి నడిగూడెం గ్రామానికి చెందిన కొండా పురుషోత్తం గారి జ్ఞాపకార్థం ఆయన భార్య కస్తూరి, కుమారులు సురేష్, సతీష్‌లు రూ.50వేల విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. అదే విధంగా నడిగూడెం గ్రామానికి చెందిన పల్లపు వెంకటేశ్వర్లు, సావిత్రమ్మ జ్ఞాపకార్థం వారి కుమారుడు పల్లపు గోపాలరావు, ప్రేమజ్యోతి దంపతులు రూ.20వేల విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో వెంకటరత్నం, వెంకట సత్యనారాయణ, సూర్యప్రకాశరావు, బుస్సా మహేష్, బోనగిరి ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

FOR SALE

★ సూర్యాపేట పాత మెయిన్ రోడ్డులో 600 చ||గజాల నాగేంద్ర కిరాణం, శ్రీనివాసు అపరాల షాపు వెనుక Sale / Development చేయుటకు గలదు. సంప్ర : 9848948440

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం... మన "నమస్తే తెలంగాణ" క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం...

ప్రతి 4 లైన్ల క్లాసిఫైడ్‌కు 200/-
ప్రతి అదనపు లైన్‌కు 50/-

Note: 3+1 Scheme Available
Minimum 4 Lines,
Extra Line - Extra Amount
5% GST అదనం

నమస్తే తెలంగాణ యూనిట్ కార్యాలయం, గ్రా: చర్లపల్లి, మం: నల్లగొండ.

| | | |
|---|---|---|
| నల్లగొండ: 9182777625, 9182777635 | | దేవరకొండ : 9182777635 |
| హాలియా : 9182777059 | సూర్యాపేట : 9182777630 | భువనగిరి : 9182777638 |
| మిర్యాలగూడ : 9182777059 | కోదాడ : 9182777630 | చౌటుప్పల్ : 9182777638 |